సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 14 । జనవరి । 2024



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

విశాఖ: మధురవాడ శిల్పారామంలో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. IIలో



ట్రైనీ ఐఏఎస్‌ల సందడి

జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్ట్‌లను 2022కు చెందిన 19 మంది ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సందర్శించింది. IIలో



16న అప్పన్న మకరవేట

కనుమ పండగను పురస్కరించుకుని ఈ నెల 16న సింహాచలం సింహగిరిపై మకరవేట ఉత్సవం జరగనుంది. IIలో

న్యూస్‌రీల్

కొత్తపల్లి జలపాతం కళకళ



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. రెండో శనివారం, ఆదివారం తోపాటు సంక్రాంతి సెలవులు కూడా కలిసి రావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. బొంగు చికెన్, చీకుల అమ్మకాలు భారీగా జరిగాయి.

ఘనంగా బలి పండగ



థింసా నృత్యం చేస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి, స్థానికులు

డుంబ్రిగుడ: మండలంలోని మారుమూల సొవ్వ పంచాయతీ మాలివలస గ్రామంలో బలి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బాక ఈశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో థింసా నృత్యాలతో సందడి చేశారు. ఒడిశా నుంచి భారీగా తరలివచ్చారు. బలి దేవతకు పూజలు నిర్వహించారు.

బైక్‌లు ఢీ.. యువకుడి మృతి



దుర్గన్న దొర మృతదేహం

గంగవరం : మండలంలోని ఎండపల్లి రామవరం గ్రామంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన మడకం దుర్గన్నదొర (19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. ఎండపల్లి గ్రామానికి చెందిన మడకం దుర్గన్న దొర వాలీబాల్ ఆడేందుకు శనివారం సాయంత్రం తన ఇంటి వద్ద నుంచి బైక్ మీద బయలుదేరాడు. అతనిని ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడు ఢీకొట్టాడు. దీంతో దుర్గన్న దొర అక్కడక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దుర్గన్నదొర మృతితో ఎండపల్లి రామవరం విషాద ఛాయలు అలుముకున్నాయి.

పోటెత్తిన పర్యాటకులు



వంజంగి హిల్స్‌లో పర్యాటకులు

సాక్షి,పాడేరు: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో పర్యాటకులు పోటెత్తడంతో మన్యంలోని పర్యాటక ప్రాంతాలు పరవశించి పోతున్నాయి. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లోని సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, మాడగడ హిల్స్, చింతపల్లి మండలంలోని చెరువులవేనంలో ప్రకృతి అందాలను వీక్షించారు.

సంక్రాంతి వేళ మహాలక్ష్మి!

- మహాలక్ష్మి పథకంతో హైదరాబాద్‌లో తగ్గిన ఆర్టీసీ బస్సు సర్వీసులు
- అందుకనుగుణంగా అటు నుంచి బస్సులను పెంచిన మన ఆర్టీసీ
- గత సంక్రాంతికి ఉత్తరాంధ్ర నుంచి 450 సర్వీసులు
- ఈసారి ఆ సంఖ్య 650 వరకు పెంపు
- వీటిలో అధికంగా హైదరాబాద్ నుంచి నడుపుతున్న అధికారులు
- సమన్వయం కోసం ఆర్టీసీ ప్రత్యేక అధికారుల నియామకం



హైదరాబాద్‌లో శనివారం రాత్రి విజయనగరానికి బయల్దేరుతున్న సూపర్ లగ్జరీ సర్వీసు

సాక్షి, విశాఖపట్నం: తెలంగాణలో మహాలక్ష్మి పథకం సంక్రాంతి వేళ ఏపీఎస్‌ఆర్టీసీకి కాసులు కురిపిస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఆ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో అక్కడ ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మునుపటిలా ఈ సంక్రాంతి పండగకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ దూర ప్రాంతాలకు తగినన్ని స్పెషల్ బస్సులను నడిపే అవకాశం టీఎస్‌ఆర్టీసీకి లేకుండా పోయింది. దీనిని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు అవకాశంగా మలుచుకున్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎక్కువ బస్సులను నడుపుతున్నారు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర దూర ప్రాంతాలకు మరిన్ని బస్సులను తిప్పుతున్నారు. గత సంక్రాంతికి ఉత్తరాంధ్ర నుంచి 450 స్పెషల్స్ తిప్పగా, ఈ సంక్రాంతికి ఆ సంఖ్య దాదాపు 650 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వీటిలో హైదరాబాద్ సర్వీసులే 150 వరకు ఉంటాయని చెబుతున్నారు. ఏటా సంక్రాంతి పండుగకు తెలంగాణలోని హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. వీరిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 10వ తేదీ నుంచి 14 వరకు, తిరిగి 17 నుంచి 22 వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. 10 నుంచి 14 వరకు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు స్పెషల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. సంక్రాంతి తర్వాత 17 నుంచి 22 వరకు ఉత్తరాంధ్ర నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి వైపు నడిపేందుకు నిర్ణయించారు.

80 శాతం ఓఆర్

హైదరాబాద్ నుంచి ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అధికంగానే ఉంటోంది. దీంతో ఈ బస్సులు జనంతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. వీటిలో 80 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉంటోంది. ఇది ఏపీఎస్‌ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. గత ఏడాదికంటే ఈ సంక్రాంతికి డిమాండ్ ఎంతో మెరుగ్గా ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో అక్కడ బస్సులు స్థానికుల అవసరాలకే సరిపోతున్నాయని, మునుపటిలా ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలకు సంక్రాంతికి అదనంగా బస్సులు నడిపే పరిస్థితి లేదని ఓ ఆర్టీసీ అధికారి ‘సాక్షి’కి చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం హైదరాబాద్ నుంచి గతం కంటే ఎక్కువ సర్వీసులను నడుపుతూ ప్రయాణికుల అవసరాలు తీరుస్తోందని వివరించారు. ఇప్పటికే పలువురు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు చేయించుకున్నారు.

సమన్వయానికి అధికారులు..

మరోవైపు హైదరాబాద్‌లో ఉత్తరాంధ్ర సహా ఆంధ్ర ప్రాంతానికి నడిపే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులను సమన్వయం చేయడానికి, ప్రయాణికులకు సహకరించడానికి యాజమాన్యం ప్రత్యేక అధికారులను నియమించింది. వివిధ స్థాయిల అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన జంక్షన్లలో ఉంటూ స్పెషల్ సర్వీసులను పర్యవేక్షిస్తున్నారు.

అందరి అభిప్రాయాలపై సీఎంకు నివేదిక

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

అరకులోయ టౌన్: అరకు అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థి ఎంపికపై అందరి అభిప్రాయాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నివేదిస్తామని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. అభ్యర్థి ఎంపిక విషయమై శనివారం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పార్టీ మండలాల అధ్యక్షులు, టికెట్ ఆశిస్తున్న వారితో అరకులోయలో సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అభిప్రాయాలు సేకరించామని చెప్పారు. వీటిని పార్టీ అధిష్టానానికి నివేదిస్తామని తెలిపారు. అరకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఏ ప్రాతిపదికన కేటాయించాలనే దానిపై అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. ఈ సమావేశంలో పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జెడ్పీటీసీలు శెట్టి రోషిణి, చటారి జానకమ్మ, రేగం మత్స్యలింగం, బొంజుబాబు, ఎంపీపీలు రంజపల్లి ఉషారాణి, బాక ఈశ్వరి, శెట్టి నీలవేణి, బొండా వరహాలమ్మ, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా విశాఖ



ఈట్ స్ట్రీట్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది (భీమిలి): విశాఖ నగరం టూరిజం హబ్‌గా మారుతోందని ఇప్పటికే తీర ప్రాంతాల్లో అనేక పార్కులను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ వద్ద మూడు కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈట్ స్ట్రీట్ పనులను ఆయన ప్రారంభించారు. మొత్తం 18 షాపులు ఇక్కడ ఏర్పాటు చేయనున్నారని, అదే విధంగా ఫుడ్ కోర్ట్స్, ఔట్ డోర్ సీటింగ్, కిడ్స్ ప్లేగ్రౌండ్, ల్యాండ్ స్కాపింగ్, యాంఫీథియేటర్, హార్డ్ స్కాపింగ్ ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం కన్నా నేటి ప్రభుత్వ హయాంలో పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందాయని, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఇప్పటికే సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, తొట్లకొండ, భీమిలి కొబ్బరి చెట్ల పార్కు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు పార్కుల అభివృద్ధితో పాటు సుందరీకరణ జరిగిందన్నారు. రూ.6 కోట్లతో మంగమారిపేట బీచ్ రోడ్డు నుంచి భీమిలి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న కాలంలో పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల యువజన రీజనల్ కోఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీష్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గుడ్లపోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, నొడగల రాంబాబు, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, రమణమూర్తి, వర్మ రాజు, పవన్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

14,148 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల విభాగం డీఎం గణేష్‌కుమార్



రాజవొమ్మంగి పరిసరాల్లో ధాన్యం కొనుగోళ్లు

రాజవొమ్మంగి: జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో 2,600 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు 14,148 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల విభాగం డీఎం గణేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన వారిలో 1498 మంది రైతులకు రూ.17.32 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మరో రూ. 7కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిని కూడా త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. అలాగే ఈ ఏడాది రైతుల నుంచి సుమారు 69 టన్నుల రాగులను కొనుగోలు చేశామన్నారు. క్వింటాలుకు ప్రభుత్వం రూ. 3,846 చెల్లిస్తోందన్నారు. రాగులు విక్రయించిన రైతులకు ఇప్పటివరకు రూ.27.5 లక్షలు చెల్లించినట్టు చెప్పారు. ఈ నెలాఖరు వరకు కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం 28వేల మెట్రిక్ టన్నులు అధిగమిస్తామన్నారు.

పీవీటీజీ గిరిజనులతో పీఎం ముఖాముఖికి ఏర్పాట్లు

- పరిశీలించిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- వర్చువల్ విధానంలో సంభాషిస్తారని వెల్లడి



సభా ప్రాంగణంలోని స్క్రీన్‌ను పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: మండలంలోని కొత్తభల్లుగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అవరణలో ఈనెల 15న ప్రధాన మంత్రి పీవీటీజీ గిరిజనులతో వర్చువల్ విధానంలో ముఖాముఖి కార్యక్రమానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ శనివారం పరిశీలించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. పీఎం జన్‌మన్ పథకాన్ని ప్రధాన మంత్రి మోదీ ప్రారంభిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పీవీటీజీ గిరిజనులతో మాట్లాడతారన్నారు. సభా ప్రాంగణంలో పీఎం ఆవాస్ యోజన ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీఎం ఉజ్వల్ ఉచిత గ్యాస్ కనెక్షన్లు,ఆదార్ కార్డుల నమోదుకు ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

చలిమంటలను ఆశ్రయిస్తున్న గిరిజనం



పాడేరు పాత బస్టాండ్‌లో వద్ద దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చలిగాలులు తీవ్రత నెలకొంది. శనివారం ఉదయం 10గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. సూర్యోదయం అయ్యేంత వరకు ప్రజలు చలి మంటలను ఆశ్రయించారు. పాడేరు మండలం మినుములూరు కాఫీబోర్డు వద్ద 12డిగ్రీలు, అరకులోయ కాఫీ బోర్డు వద్ద 12, చింతపల్లిలో 15డిగ్రీలు చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

భోగభాగ్యాల భోగి

కష్టాలను దహించే భోగి మంటలు.. భోగాలను అందించే భోగి పండ్లు.. అల్లుళ్లకు స్వాగతం పలికే తోరణాలు.. ఎటుచూసినా ధాన్యపు రాసులు.. ఇంటి ముంగిట అందమైన రంగవల్లులతో మన్యంలోని లోగిళ్లను ముస్తాబు చేశారు. శనివారం అర్ధరాత్రి భోగి మంటలతో వేడుకలకు స్వాగతం పలికారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని గ్రామచావిడి వద్ద శంకుదేముడికి గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయ తుడుము, డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలతో సందడి చేశారు — సాక్షి, పాడేరు



పాడేరు పట్టణంలోని గుడివాడ గ్రామ చావిడి వద్ద భోగి మంట

హుకుంపేట కిటకిట

పండగ సంతకు భారీగా తరలి వచ్చిన గిరిజనం



హుకుంపేట వారపు సంతకు భారీగా తరలివచ్చిన గిరిజనులు



నాటుకోళ్ల విక్రయాలు



మట్టి కుండల కొనుగోళ్లు

హుకుంపేట: సంక్రాంతి పండగ నేపథ్యంలో శనివారం హుకుంపేటలో జరిగిన వారపు సంత కిటకిటలాడింది. పరిసర మండలాలతోపాటు ఒడిశా నుంచి భారీగా గిరిజనులు తరలివచ్చారు. అల్లం, పసుపు, పిప్పళ్లు, కందులు, నాగలి దుంపలు, సారు దుంపలతో నాటుకోళ్లు, మేకలను విక్రయించారు. మంచి ధర లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు. సంతలోని వస్త్ర దుకాణాలు రద్దీగా కనిపించాయి. కుండలు, మట్టి పాత్రల అమ్మకాలు భారీగా జరిగాయి.

క్లుప్తంగా

సారాతో వ్యక్తి అరెస్టు

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగి గ్రామశివార్లలో శ్రీరాంనగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా విక్రయిస్తున్న గరగ లోవరాజును అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎస్.వెంకయ్య శనివారం తెలిపారు. అతనిని అడ్డతీగల జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు చెప్పారు.

శ్రీవారి లడ్డు విక్రయం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో (టీటీడీ) రెండో శనివారం లడ్డు విక్రయాలు కొనసాగాయి. లడ్డు విక్రయాల కౌంటర్ వద్ద భక్తులు బారులు తీరారు. రూ. 50 లడ్డులు అందుబాటులో ఉండటంతో భక్తులు వాటిని కొనుగోలు చేశారు.

వైభవంగా శ్నపన తిరుమంజనం

శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకులు, వేద పండితులు ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కొత్తవలస: కొత్తవలస–పెందుర్తి రైల్వే లైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి తాటిచెట్లపాలెం సమీపంలోని సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిసింది. మంగళపాలెంలో తెలిసిన వారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఏడీ రావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు.

16న అప్పన్న మకరవేట



ఉత్సవంలో స్వామి కొలువుదీరే ప్రధాన మండపం



శ్రీకృష్ణకొలను

- వరదరాజస్వామిగా దర్శనమివ్వనున్న స్వామి వారు
- ముస్తాబైన కొండదిగువ పూలతోట
- రాత్రి గజవాహనంపై గ్రామ తిరువీధి
- సాయంత్రం 6గంటల వరకే మూలవిరాట్ దర్శనం

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీ మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట (గజేంద్రమోక్షం) ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆపదలో ఉన్నవారెవరు పిలిచినా భగవంతుడు ఏదో ఒకరూపంలో వచ్చి రక్షిస్తాడని.. మొసలి బారిన పడిన గజేంద్రుడి చరిత్రే దానికి నిదర్శనమని చాటిచెబుతూ ఈ ఉత్సవాన్ని ఏటా కనుమ పండగ రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఉత్సవం జరిగేదిలా..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వరదరాజస్వామి అలంకరణ చేసి మంగళవారం సాయంత్రం 4గంటలకు సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గం ద్వారా తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని కొలువుదీర్చి, గజేంద్రమోక్షం ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్ఠింపజేస్తారు. తదుపరి అడవివరం గ్రామ వీధుల్లో గజవావానంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు.

ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటను విశేషంగా ముస్తాబు చేశారు. పూలతోటలోని శ్రీకృష్ణ కొలను, స్వామి వేంజేసే ప్రధాన మండపం, రాతి ఫౌంటెన్లకు విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. ఆ రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

సాయంత్రం 6గంటల వరకే దర్శనాలు

మకరవేట ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్ దర్శనాలు మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లభిస్తాయని ఈవో తెలిపారు. భక్తులు ఈ విషయం గమనించాలని సూచించారు.

ట్రైనీ ఐఏఎస్‌ల సందడి

పలు ప్రాజెక్ట్‌ల పరిశీలన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్టలను శనివారం ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. నగరానికి విచ్చేసిన 19 మంది 2022 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లకు జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్టులను జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బంటు సన్యాసినాయుడు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, కేవీఎన్ రవి, కృష్ణారావు చూపించారు. కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ తయారవుతున్న ప్రాజెక్ట్, ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థ, ఎంవీపీలోని స్పోర్ట్స్ ఎరీనాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. నగరంలోని వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించి.. ఆ చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థ ద్వారా 40 శాతం విద్యుత్‌ను జీవీఎంసీ ఆదా చేయగలుగుతోందన్నారు. జిందాల్ కంపెనీ ప్రతినిధులు, ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థ నిర్వాహకులు, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీర్ దిలీప్, ఏపీ టూరిజం ఎస్కార్ట్ వైఎస్ రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మధురవాడ (విశాఖ): సంక్రాంతి సందర్భంగా శనివారం శిల్పారామంలో సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కళారాధన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేవస్తుతి, పుష్పాంజలి, శివాష్టకం, సరస్వతి స్తుతి, భరతవేదము, బాలగోపాల తరంగం తదితర అంశాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా సంబరాల్లో భాగంగా భోగి పండగ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీ శివసాయి భరత నాట్య కళా బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక నాట్య, జానపద నృత్య ప్రదర్శన ఉంటుందని శిల్పారామం పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

కన్నీటి గాథ.. నాటకానికి కథ

- పుట్టింట, మెట్టింట బాల సన్యాసమ్మకు కష్టాలు
- పేరంటాలుగా పూజలందుకుంటున్న వైనం
- నేడు దిమిలిలో ప్రదర్శన



బాల సన్యాసమ్మ నాటకంలో దృశ్యం

రాంబిల్లి: ఆమె పుట్టింట ధనవంతురాలు. బోలెడంత ఆస్తి, సారె, లాంఛనాలతో వచ్చి మేనమామను పెళ్లాడింది. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. సవతి తల్లి నానా కష్టాలు పెట్టడంతో పుట్టింట ఇబ్బందులు పడింది. మెట్టింట భర్త దేశభక్తితో సిపాయిగా పనిచేయడంతో అత్త, తోటికోడళ్ల ఆరళ్లతో విసిగిపోయి అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం చేసింది.. ఆమే బాల సన్యాసమ్మ. అత్తవారి గ్రామమైన కట్టుబోలులో ఆమె పేరంటాలు అమ్మవారిగా పూజలందుకుంటోంది. కనుమ రోజున ఈ గ్రామంలో భారీస్థాయిలో తీర్థాన్ని నిర్వహిస్తారు.

బాలసన్యాసమ్మ యదార్థ గాథ

ధర్మవరానికి చెందిన దాలినాయుడు కుమార్తె బాలసన్యాసమ్మను కట్టుబోలు గ్రామానికి చెందిన తన సోదరి కుమారుడు చెంచెన్నతో వివాహం జరిపించారు. ఆ సమయంలో ఎంతో ఆస్తి, సారె సమర్పించారు. భర్త చెంచెన్న దేశభక్తిపై మమకారంతో సిఫాయిగా సేవలందించేవారు. సవితి తల్లితో పుట్టింట కష్టాలు పడిన బాలసన్యాసమ్మ అత్త దాలమ్మ, తోటికోడలు లక్ష్మి అష్టకష్టాలు పెట్టేవారు. వరకట్నం కోసం అత్త తరచూ వేధించేవారు. అత్త పెట్టే కష్టాలు చెబుతామంటే, దేశసేవ నుంచి ఉద్యోగం మానేసి వచ్చేస్తారని భర్తకు చెప్పలేకపోయేది. బాలసన్యాసమ్మకు దేశంపై మమకారం ఉండేది. దీంతో దేశసేవకు తన భర్త దూరం కావడం ఇష్టం లేకపోయింది. చివరికి అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం చేసింది. తర్వాత ఈ గ్రామంలో ఆమె అమ్మవారిగా వెలిశారు. గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దశాబ్దాలుగా పూజలందుకుంటున్నారు.

కనుమ రోజున కట్టుబోలులో భారీ తీర్థం

దిమిలికి చెందిన వానపల్లి నూకాచారి బాల సన్యాసమ్మ కథను రచించారు. ఇదే గ్రామానికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం కోవెల వెంకటరావు హీరోగా తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రదర్శిస్తున్నారు. భోగి రోజున సంతోషిమాత తీర్థం సందర్భంగా ఆదివారం దిమిలిలో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. అదేవిధంగా కనుమ రోజు కట్టుబోలులో అమ్మవారి తీర్థ మహోత్సవానికి పలు ప్రాంతాల నుంచి వేలాదిగా జనం తరలివస్తారు.

రూ.10 లక్షలతో ఏలేరు కాలువపై ఐరన్ గ్రిల్స్

నాతవరం: ఏలేరు కాలువ గట్టుపై ప్రయాణించే వారికి ప్రమాదాలు జరగకుండా రూ.10లక్షల వ్యయంతో రెండు ప్రాంతాల్లో ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశామని, మిగతా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని విస్కో జేఈ నానాజీ తెలిపారు. ఎ.శరభవరరం, రాజుపేట అగ్రహారం గ్రామాల సమీపంలో ఏలేరు కాలువ గట్టుపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు నీటిని కాలువ ద్వారా తరలిస్తున్నారని, ఉమ్మడి రెండు జిల్లాల పరిధిలో సుమారు 154 కిలో మీటర్ల పొడవున ఏలేరు కాలువ ప్రవహిస్తోందని తెలిపారు. మధ్యలో చాలా గ్రామాల ప్రజలు కాలువ గట్టుపై రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎం.బి. పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం వద్ద, రాజుపేట అగ్రహారం వద్ద గ్రిల్స్ ఏర్పాటు పనులు పూర్తికావచ్చాయని, ఏలేరు కాలువ పొడవునా ప్రమాదకరంగా ఉన్న మిగతా ప్రాంతాల్లో కూడా గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న ఏలేరు కాలువ గట్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు.

చెరకు బకాయిల గ్రాంట్ రూ.12.30 కోట్లు విడుదల

- సంక్రాంతి సెలవులనంతరం రైతుల ఖాతాల్లో జమచేస్తాం
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: గోవాడ రైతులకు చెరకు బకాయిలు చెల్లించేందుకు రూ.12.30 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, ఆ సొమ్మును ఫ్యాక్టరీ ఖాతాలో జమచేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం చెప్పారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సీజన్‌కు సంబంధించి చెరకు రైతులకు రూ.7.11 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, అదేవిధంగా కార్మికులకు బకాయిలు మరో రూ.5 కోట్లు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ప్రభుత్వాన్ని గ్రాంట్‌గా ఇమ్మని కోరామని ధర్మశ్రీ చెప్పారు. రైతుల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మొత్తం రూ.12.30 కోట్లు గ్రాంట్‌గా మంజూరు చేశారని, ఆ సొమ్ము శుక్రవారం రాత్రి గోవాడ ఫ్యాక్టరీ ఖాతాలో జమ అయిందన్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో రైతుల ఖాతాల్లోకి జమచేయడానికి వీలుకాలేదని, బ్యాంక్ సెలవుల అనంతరం నేరుగా రైతుల ఖాతాల్లోకి చెరకు బకాయిలు జమచేయనున్నట్టు చెప్పారు. ఫ్యాక్టరీ కార్మికులకు రూ.2కోట్ల జీతభత్యాలు, పదవీవిరమణ చేసిన కార్మికులకు చెల్లించాల్సిన మరో రూ.2కోట్ల బకాయిలు కూడా వెంటనే చెల్లిస్తామన్నారు. ఫ్యాక్టరీ నిర్వహణ కోసం మరో రూ.కోటి ఖర్చుచేయాలని ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ ప్రతిపాదనలు ఉండడంతో వాటికి ఖర్చుచేస్తారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్ రూ.12.30 కోట్లతో పాటు ఫ్యాక్టరీ సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి ట్రాన్స్‌కో నుంచి రావలసిన రూ.50 లక్షలు కూడా ఆ శాఖ విడుదల చేసిందని ధర్మశ్రీ చెప్పారు. దీంతో రైతుల బకాయిలు, కార్మికుల బకాయిలు పూర్తిగా చెల్లిస్తామన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు రైతుల తరపున ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రాంటు విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే ధర్మశ్రీని రైతులు, కార్మికులు సత్కరించారు. అనంతరం ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

భూమి అమ్మలేదని అడ్డు తొలగించింది..

- మద్యంలో పురుగుమందు కలిపి తాగించిన భార్య
- పథకం ప్రకారం హత్య
- మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు



విషాదంలో బంధువులు, కుటుంబ సభ్యులు



విచారణ చేస్తున్న సీఐ ఆనంద్‌బాబు



గోవింద్ మృతదేహం



గోవింద్ (ఫైల్)

కశింకోట: ఆస్తి కోసం భర్తను అతి కిరాతకంగా ఓ భార్య హతమార్చడం స్థానికంగా సంచలనమైంది. శుక్రవారం రాత్రి మండలంలోని బయ్యవరంలో జరిగిన ఈ దారుణ సంఘటనకు సంబంధించి సీఐ ఆనందబాబు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యవరం ఎస్సీ కాలనీకి చెందిన బరుకు గోవింద్ (43)కు యలమంచిలికి చెందిన శివలక్ష్మికి 2015లో వివాహమైంది. కుటుంబంలో ఆమెదే ఆధిపత్యం. విలాసవంతమైన జీవితాన్ని కోరుకునేది. పెళ్లయి ఎనిమిదేళ్లయినా సంతానం కలగలేదు. గోవింద్ భార్యను తరచూ అనుమానించడం వల్ల వారి మధ్య మనస్పర్ధలు చోటుచేసుకోవడంతో తరచూ గొడవ పడుతుండేవారు. కుటుంబ సభ్యులు, పెద్దలు నచ్చజెప్పినా వారిలో మార్పు లేదు.

హతమార్చేందుకు పన్నాగం ఇలా..

ఉమ్మడి ఆస్తుల పంపకంలో గోవింద్‌కు దాఖలుపడిన పది సెంట్ల భూమిని అమ్మి నగదు ఇవ్వాలని, అప్పులు తీర్చాలంటూ భార్య శివలక్ష్మి తరచూ గొడవ పడుతుండేది. అయితే ఆ స్థలం జాతీయ రహదారి పక్కన ఉంది. ఎక్కువ ధర పలుకుతుండటంతో అమ్మేందుకు గోవింద్ మొగ్గుచూపలేదు. ఈ నేపథ్యంలో ఆస్తి కోసం గోవింద్‌ను అడ్డుతొలగించుకోవాలని భావించింది. ఈ నెల 5న భర్తతో మద్యం తాగించి కాళ్లు, చేతులు కట్టి ముఖంపై తలగడను పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేందుకు ప్రయత్నించింది. గోవింద్ అప్రమత్తం కావడంతో ఆ ప్రయత్నం విఫలమైంది. మరుసటి రోజు కూడా పీక నులిపి హత్యకు ప్రయత్నించగా భయపడిన గోవింద్ కుటుంబ సభ్యులు, బంధువులకు ఈ విషయం తెలిపాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఎప్పుడూ ఆదరించని తన అత్తను ఇంటికి పిలిచి శివలక్ష్మి భోజనం పెట్టింది. అనంతరం నిద్రకు ఉపక్రమించారు. దీంతో తన పన్నాగాన్ని మళ్లీ భర్తపై ప్రయోగించింది. మద్యంలో పురుగుల మందు కలిపి భర్త గోవింద్‌కు తాగించడంతో మృతిచెందాడు. సాధారణ మృతిగా నమ్మించేందుకు ఆధారాలు కనిపించకుండా చేసింది. భర్త గోవింద్ ఎంత పిలిచినా లేవడం లేదని నిద్రలేపి అత్తకు తెలిపింది. అత్త నిద్ర మేల్కొని పరిశీలించింది. కుమారుడు విగత జీవిగా మారినట్టు గుర్తించింది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని భార్య శివ లక్ష్మి హత్యచేసినట్టుగా ఆమె నిర్ధారణకు వచ్చింది. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, సీఐ ఆనంద్‌బాబు తమ సిబ్బందితో రంగంలోకి దిగి దర్యాప్తు జరిపారు. వేలిముద్ర నిపుణులు, క్లూస్ బృందం వచ్చి ముద్రలు సేకరించారు. తల్లిని, కుటుంబ సభ్యులను, చుట్టుపక్కల వారితోపాటు శివ లక్ష్మిని విచారించారు. దీంతో ఆమె భర్తను హత్య చేసినట్లు విచారణలో నిర్ధారణ అయింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆనంద్‌బాబు తెలిపారు.